సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 30 । జనవరి । 2023



స్వచ్ఛతే 'ఆభరణం'

కొనకమ్ములు, బల్లకమ్ములు గుర్తున్నాయా..? గూబకుట్లు, నానుల గురించి తెలుసుకోవాలనుందా..?

- 8లో



జాతరకు వేళాయె

కమ్మసిగడాం జాతర నేటి నుంచి జరగనుంది. నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- 8లో

శ్రీనివాసుని సన్నిధిలో..



సారవకోట: మండలంలోని అవలింగి గ్రామానికి చెందిన కోలాట బృందం తిరుపతి శ్రీనివాసుని సన్నిధిలో ప్రదర్శన ఇచ్చింది. రథసప్తమి సందర్భంగా స్వామి వారి తిరువీధి సమయంలో ఈ కోలాట బృందం కోలాటం ప్రదర్శించారు.

న్యూస్‌రీల్

అచ్చెన్నపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



టెక్కలిలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీటీసీ దువ్వాడ వాణి

టెక్కలి: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పోలీసులపై బూతులు మాట్లాడిన టీడీపీ నేత అచ్చెన్నాయుడును తక్షణమే అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణిలు ఆదివారం టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లోకేష్ పాదయాత్ర సభలో చంద్రబాబు మెప్పు పొందడానికి అచ్చెన్నాయుడు తన స్థాయిని మరిచి సీఎం పై అనుచితంగా మాట్లాడారని, అలాగే పోలీస్ వ్యవస్థను కించ పరిచే విధంగా రాయలేని భాషలో దూషించారని, దీనిపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలని టెక్కలి సీఐ చంద్రమౌళి, ఎస్ఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న అచ్చెన్న టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి తద్వారా విధ్వంసాలు సృష్టించే విధంగా వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇలాంటి వాటికి కళ్లెం వేసే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సారా నియంత్రణకు అవగాహన



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ కృష్ణారావు

కాశీబుగ్గ: కాశీబుగ్గలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఆటో డ్రైవర్ల యూనియన్లతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సీఐ కోన కృష్ణారావు మాట్లాడుతూ నాటు సారా కేసుల్లో సగానికి పైగా కేసుల్లో ముద్దాయిలు నాటు సారాని షేర్ ఆటోలతోనే రవాణా చేస్తున్నారని, ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు నాటు సారాతో ఆటో ఎక్కితే వారిపై ఫిర్యాదు చేయాలని, లేదంటే ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. ఆటోను కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. నాటు సారా కేసులో నేరం రుజువైతే ఎనిమిదేళ్ల జైలు శిక్ష, మొదటి సారి దొరికితే రూ.రెండు లక్షలు, రెండో సారి దొరికితే రూ.5లక్షలు జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో గొప్పిలి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కోట ఉమాపతి, మెంబర్ కె.సీతారాం, రెంటికోట ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఆలేటి భీముడు, సెక్రెటరీ పిట్ట శ్రీనివాసరావు, నువ్వలరేవు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ జి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ



కాటమ్మతల్లి విగ్రహం వద్ద దొంగతనం జరిగిన తీరు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, క్రైమ్ టీమ్

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లాలోని కాటమ్మతల్లి ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ పూజారి జన్ని వెంకటరావు ఆదివారం ఉదయం మూడున్నర గంటలకు ఆలయానికి వచ్చి చూడగా.. ఉత్తర ద్వారం తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే వెండి ఆభరణాలు కనిపించలేదు. అదే ఆవరణలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బంగారు ఆభరణాలు కనిపించడం లేదని ఆలయ పూజారి బూరగాపు వైకుంఠరావు సైతం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగి ఉంటుందని సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం క్రైమ్ టీమ్, క్లూస్ టీమ్‌కు సమాచారం అందించడంతో ఆలయంలో పడిన వేలిముద్రలను, ఇతర వివరాలను సేకరించారు.

బోధనమున పనులు..!

ఆ లెక్కల క్లాసు మరోమారు వినాలా..? మాస్టారు మళ్లీ వచ్చి చెప్పనక్కర్లేదు. ఫిజిక్స్‌లో సందేహాలు అలాగే ఉండిపోయాయా..? తర్వాతి రోజు స్కూల్‌కు వెళ్లే వరకు ఆగనక్కర్లేదు. పుస్తకంలోని పేజీలు జోల పాడుతున్నాయా..? కునికిపాట్లు పడుతూ కాగితాలు తిప్పనక్కర్లేదు. ప్రభుత్వ విద్యార్థి చేతికి ట్యాబ్ వచ్చేసింది మరి. 300 వీడియోలు, 168 ప్రశ్న పత్రాలు, 472 కాన్సెప్టులతో ఈ పరికరం విద్యార్థులకు వరంలా మారుతోంది. ఎంతగా వినియోగించుకుంటే అంతలా మేలు జరుగుతుంది. నాడు–నేడులో వీధిబడుల విధిరాత మార్చిన సర్కారు.. ఈ ట్యాబ్‌ల పంపిణీతో సరికొత్త విద్యా విప్లవానికి నాంది పలికింది.

- ట్యాబ్‌ల సాయంతో విద్యార్థులకు సమున్నత బోధన
- జిల్లాలో 25,953 మందికి ట్యాబ్‌ల పంపిణీ
- బైజూస్ సాయంతో ఉన్నత స్థాయి మెటీరియల్ అందజేత



ఇచ్ఛాపురం: ఆదర్శ పాఠశాలలో ట్యాబ్‌లు చూస్తున్న విద్యార్థులు

టెక్కలి, ఇచ్ఛాపురం: పూరింటిలో పిల్లాడు ట్యాబ్ పట్టుకుని చదివే దృశ్యం ఎంతటి ఆహ్లాదకరం. సాధారణ మిద్దె ఇంటిలో అమ్మాయి ట్యూషన్లతో సంబంధం లేకుండా ఇంటిలోనే పాఠాలు వినగలగడం ఎంత అదృష్టం. వైఎస్సార్ సీపీ సర్కారు చొరవతో ఇవన్నీ సాకారమవుతున్నాయి. ఎనిమిదో తరగతి పిల్లలకు గత ఏడాది పంపిణీ చేసిన ట్యాబ్‌లు సత్ఫలితాలు అందిస్తున్నాయి. ఇప్పటికే నాడు–నేడుతో పాటు అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెనతో చదువు అందరికీ చేరువ చేసిన వైఎస్ జగన్ సర్కారు ట్యాబ్‌లతో విద్యా విధానంలో విప్లవమే తెచ్చింది. మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సాంకేతిక మేధస్సు పెంపొందించాలనే ఉద్దేశంతో అతి విలువైన ట్యాబ్‌లను అందజేయడమే కాకుండా 'బైజూస్' సంస్థ నిర్వహణలో విద్యార్థులకు అవసరమైన బోధనలను సాంకేతికంగా అందజేస్తున్నారు. గత డిసెంబర్‌లో 8వ తరగతి విద్యార్థులకు వీటిని అందించారు.

విజ్ఞాన నిధి..

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌ల్లో గణితం, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీ, హిస్టరీ, జియాలజీ, సివిక్స్ సబ్జెక్టులతో కూడిన అంశాలను ఆయా సబ్జెక్టుల వారీగా విభజించారు. 57 చాప్టర్లకు 472 కాన్సెప్టులతో 300 వీడియోలు, జవాబులతో కూడిన 168 క్వశ్చన్ బ్యాంకులను పొందుపరిచారు. ఒక్కో చాప్టర్ తర్వాత 40 నుంచి 50 ప్రశ్నలతో గ్రేడ్‌ల వారీగా నమూనా పరీక్షలు ఉంటాయి. పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యే విధంగా బొమ్మలు, వీడియో, ఆడియో, త్రీడీ, యానిమేషన్ చిత్రాలు సమకూర్చారు. అంతే కాకుండా అవాంఛనీయ సైట్లు చొరబడకుండా ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను పొందుపరిచారు. నెట్ లేకపోయినా కేవలం మెమొరీ కార్డు ఆధారంగా ట్యాబ్ పనిచేస్తుంది. మూడేళ్ల పాటు గ్యారెంటీతో వీటి బాధ్యతను సచివాలయాలకు అప్పగించారు. ఎన్‌సీఈఆర్‌టీ ఆధారంగా రూపొందించిన బైజూస్ పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఈ పాఠ్యాంశాలను ఆఫ్‌లైన్ మోడ్‌లో పొందుపర్చడంతో నెట్‌అవసరం లేకుండానే క్లాస్‌లను విద్యార్థులు వీక్షించే అవకాశం ఉంది. పిల్లలే స్వయంగా పాఠాలు నేర్చుకునేలా బొమ్మలు, గ్రాఫిక్స్, 2డి, త్రీడీ యానిమేషన్స్, ఆడియో, వీడియో ఆధారంగా రూపొందించారు.

ట్యాబ్ చాలా ఖరీదు



ప్రభుత్వం మా లాంటి పేద విద్యార్థులకు ఎంతో ఖరీదైన ట్యాబ్ ఇచ్చింది. 8వ తరగతి నుంచి ట్యాబ్‌లో బోధన ఆసక్తికరంగా ఉంది. భవిష్యత్‌లో కంప్యూటర్ పరిజ్ఞానంపై ఇప్పటి నుంచి పూర్తి స్థాయిలో అవగాహన కలుగుతోంది.

– ఆర్.గాయత్రి, 8వతరగతి విద్యార్థిని, ఏపీఎంజేపీ పాఠశాల, టెక్కలి



టీచర్లు లేకపోయినా..

కొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాల్లో ఒక్కో సారి సందేహాలు ఉండిపోతాయి. అవి కూడా ట్యాబ్‌ల సాయంతో నివృత్తి చేసుకోవచ్చు. పాఠ్యాంశాలకు సంబంధించి అనేక రకాలుగా ఈ ట్యాబ్‌లో బోధనలు అందజేస్తున్నారు.

– ఎస్.సుష్మా, 8వ తరగతి విద్యార్థిని, ఏపీఎంజేపీ పాఠశాల, టెక్కలి.

ఉపయోగపడుతోంది



విదేశాల్లో ఇలా ట్యాబ్‌లు, కంప్యూటర్లతో ప్రాథమిక స్థాయిలో విద్యను అందజేస్తుంటారు. అలాంటి సాంకేతిక విద్యను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేయడం గొప్ప విషయం. విద్యార్థులకు ఎంతగానో ఈ ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి.

– ఎస్.మహ్మద్, బయాలజీ ఉపాధ్యాయురాలు, ఏపీఎంజేపీ పాఠశాల, టెక్కలి.

తరగతులు నిర్వహించాలి..



ఈ ట్యాబ్‌లతో కార్పొరేట్ స్థాయి విద్య ప్రభుత్వ పాఠశాల పిల్లలకు అందుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ తరగతులను టైమ్ టేబుల్ ఆధారంగా రోజూ బోధించాలి. దీనిపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తాం.

– గార పగడాలమ్మ, డీఈఓ

ఆసక్తిగా పాఠాలు వింటున్నారు



ఒకప్పుడు తరగతి గదిలో బోర్డుపై రాసే పాఠాలు వినేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌ల్లో అనేక రకాల పాఠ్యాంశాలు ఉండడం వల్ల విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా పాఠాలు వింటున్నారు. – బి.దామోదర్రావు, ప్రిన్సిపాల్, ఏపీ ఎంజేపీ పాఠశాల, టెక్కలి.

జిల్లాకు 25,953 ట్యాబ్‌లు సరఫరా



జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో 25,953 ట్యాబ్‌లు సరఫరా చేశారు. ఇందులో 22,982 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. అలాగే బోధన కోసం 2971 మంది ఉపాధ్యాయులకు ఈ ట్యాబ్‌లను అందజేశారు. మరో 1067 ట్యాబ్‌లు జిల్లాకు చేరాయి. వాటిని మరికొంత మంది ఉపాధ్యాయులకు అందజేస్తాం.

–ఎస్.జగదీష్, జిల్లా నోడల్ అధికారి.

ఆదిత్యుని సన్నిధిలో మాఘ మాస సందడి

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధికి మాఘమాసం రెండో ఆదివారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం రథసప్తమి జరిగిన నేపథ్యంలో బారికేడ్లు ఎక్కడికక్కడే ఉన్నా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ భక్తుల దర్శనాలకు తగిన ఏర్పాట్లు చేశారు. మాఘ మాసం సందర్భంగా భక్తులు పెసలు, గోధుమలు, ఇతరత్రా ప్రసాదాలను ఆదిత్యునికి నివేదించారు. అలాగే మహిళలు ఇంద్ర పుష్కరిణి పరిసరాల్లో పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి ప్రసాదంగా సమర్పించారు. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి దర్శనాలకు అనుమతిచ్చారు. ఆరోగ్యం కోసం సూర్య నమస్కార పూజలను చేయించారు. ఈపీడీసీఎల్ డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక దర్శనం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ ఒక్క రోజులో ఆలయానికి రూ.6,07,582 ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలియజేసారు. దర్శన టిక్కెట్లు ద్వారా రూ.2,55,900, విరాళాల ద్వారా రూ.91,682, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.60 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లుగా ఆయన తెలిపారు.



పుష్కరిణి వద్ద క్షీరాన్నం వండుతున్న భక్తులు



ఆదిత్యుని జ్ఞాపికను మంత్రి బొత్స దంపతులకు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆదిత్యుని సన్నిధిలో మంత్రి బొత్స

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు కుటుంబసమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ అద్భుత ఆరోగ్య క్షేత్రాన్ని దర్శించుకోవడం ఆనందకరమన్నారు. ఆయనతో పాటు మంత్రి కుమారుడు డాక్టర్ బొత్స సందీప్ దంపతులు,కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఆర్వో రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నేతలు మండవల్లి రవి, ఎంవి.స్వరూప్, నందిగాం ఎంపిపి ఎన్.శ్రీరామమూర్తి, ఆర్డీవో శాంతి, డీఈఓ పగడాలమ్మ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. జయప్రకాష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రీ పబ్లిక్



శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ ప్రీ పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. పబ్లిక్ పరీక్షలు మార్చి 15 నుంచి మొదలుకానున్న నేపథ్యంలో ఈలోగా ముందస్తుగా ప్రీ పరీక్షలను నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఇంటర్‌బోర్డు అధికారులు భావించారు. ఇందులో భాగంగా ప్రస్తుతానికి మొదటి ప్రీపబ్లిక్ పరీక్షలను సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండో ప్రీపబ్లిక్ పరీక్షలను కూడా నిర్వహించే యోచనలో ఇంటర్‌బోర్డు ఉంది. అయితే ఆ తేదీలు వెల్లడికావాల్సి ఉంది.

ఉదయం ఫస్టియర్‌కు, మధ్యాహ్నం సెకండ్ ఇయర్‌కు..

ప్రీ పబ్లిక్ పరీక్షలను ఒక నిర్దిష్టమైన షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రధానమైన జనరల్ కోర్సుల పరీక్షలు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు నిర్విరామంగా జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు ముగిసిన తర్వాత దిద్దుబాటు చేయనున్న మార్కులను సంబంధిత రికార్డుల్లో నమోదు చేయనున్నారు. 2022 ఇంటర్ పబ్లిక్ పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షలను ఏప్రిల్, జూలైలో నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం మూడు సెట్ల ప్రశ్న పత్రాల్లో రెండింటిని వినియోగించగా.. మిగిలిన ఒక సెట్ ప్రశ్న పత్రాన్ని ఈ ప్రీపబ్లిక్ పరీక్షలకు వినియోగించేలా జిల్లా ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో జూనియర్ కళాశాలలు 191 ఉన్నాయి. అయితే వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 166 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్ స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్ స్కూల్ కాలేజీలు 5, కో ఆపరేటివ్ 2, ప్రైవేటు కళాశాలలు 73 ఉన్నాయి. వీటిల్లో మొత్తం 50,526 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 25,112 మంది, ద్వితీయ సంవత్సరం 25,414 మంది చదువుతున్నారు.

తనిఖీలు చేస్తాం..



జిల్లాలో సోమవారం నుంచి జరిగే ప్రీ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు పూర్తిచేశాం. ఉదయం ఫస్టియర్‌కు, మధ్యాహ్నం సెకండియర్ వారికి పరీక్షలు జరుగుతాయి. ఐపీఈ–2022 ప్రశ్నాపత్రాల సెట్‌ను వినియోగిస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రిన్సిపాళ్లకు మార్గదర్శకాలను జారీ చేశాం. పరీక్షల తీరుపై కళాశాలల్లో తనిఖీలు చేస్తాం.

– కోట ప్రకాశరావు, జిల్లా డీవీఈఓ, ఇంటర్మీడియెట్ విద్య



పరీక్షలకు సన్నద్ధమవుతున్న ద్వితీయ ఇంటర్ విద్యార్థులు

అవగాహనే అసలు మందు

- లెప్రసీ నిర్మూలనకు జిల్లా అధికార యంత్రాంగం కృషి
- నేటి నుంచి ఫిబ్రవరి 13 వరకూ పక్షోత్సవాలు



సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

జలుమూరు: కుష్టు వ్యాధిని నివారించేందుకు అవగాహనే అసలైన మందు అని అధికారులంటున్నారు. లెప్రసీ కేసులు సమూలంగా నిర్మూలించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్పర్శ్ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (ఎస్ఎల్ఏసీ) నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకూ పక్షోత్సవాలు గ్రామగ్రామాన నిర్వహించనున్నారు. జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఒకప్పుడు వేలల్లో ఉండేది. ఇప్పుడు ఆ సంఖ్య వందలకు తగ్గింది. అయితే ఇంకా అక్కడక్కడా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ప్రధానంగా చిన్నపిల్లల్లో (14 ఏళ్ల లోపు), మహిళల్లో ఈ వ్యాధి కనిపించడం ఆందోళన కలిగిస్తున్న విషయం. ఇటీవల నిర్వహించిన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 10 మంది వరకూ చిన్నపిల్లలు బాధితులుగా ఉన్నట్లు గుర్తించారు. ఇవి పూర్తిగా నివారించాలంటే గుర్తింపు జరగాలని ప్రభుత్వం ఎల్సీడీసీ, ఎస్ఎల్ఏసీ సర్వేలు నిర్వహించి చికిత్సలు కూడా ప్రారంభించింది.

లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్సీడీసీ)

కుష్టు వ్యాధి నివారణకు భారత ప్రభుత్వం 2016లో మొట్టమొదటి సారిగా పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ప్రారంభించింది. మన రాష్ట్రంలో కూడా ఇది విజయవంతమైంది.

ప్రస్తుతం ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం జిల్లాలో 189 లెప్రసీ వ్యాధి గ్రస్తులు మల్టీ డ్రగ్ థెరపీ తీసుకుంటున్నారు. ఇందులో 123 పాసి బ్యాసిలరి,(పీబి) మల్టీ బ్యాసిలరి(ఎంబీ) 66 కేసులు ఉన్నాయి.

వ్యాధి నిర్ధారణ ఇలా..

శరీరంపై ఉండే స్పర్శ లేని మచ్చలు, నాడుల వాపు ఆధారంగా ఈ వ్యాధి నిర్ధారణ చేస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో వైద్యాధికారి, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సంయుక్తంగా వ్యాధిని నిర్ధారిస్తారు. శరీరంపై స్పర్శ లేని మచ్చల ఆధారంగా ఈ వ్యాధిని 2 రకాలుగా విభజిస్తారు. ఇవి పీబీ, ఎంబీగా ఉంటాయి. శరీరంపై ఐదు కన్నా తక్కువ మచ్చలు ఉంటే పీబీ వీటిని ఆరునెలలు మల్టీ డ్రగ్ థెరపీతో చికిత్స చేసి నివారణ చేస్తారు. ఐదు కంటే ఎక్కువ ఉంటే ఎంబీగా నిర్ధారించి 12 నెలలు చికిత్స అందిస్తారు.

వ్యాధి నిర్మూలనే లక్ష్యం..

ఎల్సీడీసీ సర్వేతోపాటు ఏటా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకూ 15 రోజుల పాటు లెప్రసీ అవగాహన కార్యక్రమం ఉంటుంది. మహాత్మా గాంధీ కుష్టు రోగులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన వర్ధంతి రోజున కుష్టు వ్యతిరేక దినంగా వ్యవహరిస్తున్నారు. ఈ 15 రోజులు వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, స్కూళ్లు, పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్రాథమిక దశలో గుర్తించాలి



కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ చికిత్స చేయడం వల్ల నరాలు దెబ్బ తినకుండా కాపాడవచ్చు. వ్యాధిపై భయం పోగొట్టి అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చు. కుష్టు వ్యాధి నివారణకు ప్రజలందరి భాగస్వామ్యం అవసరం. – డాక్టర్ ఎన్. అనురాధ, జిల్లా లెప్రసీ ఎయిడ్స్,టీబీ అధికారి శ్రీకాకుళం

ప్రభుత్వ వైద్యమే దివ్య ఔషధం



కుష్టు వ్యాధి నివారణకు మల్టీ డ్రగ్ థెరపీ తప్ప ఇతర ప్రైవేటు వైద్యం పనిచేయదు. ఇటీవల జిల్లాలో నిర్వహించిన ఎల్సీడీసీ సర్వేలో కేసులు గుర్తించి చికిత్స ప్రారంభించాం.

– వాన సురేష్ కుమార్, డిప్యూటీ పారా మెడికల్ అధికారి

మన జిల్లాలో ఎల్‌సీడీసీ సర్వే				
సంవత్సరం	2017	2018	2019	2022
కేసులు	219	195	169	85

కరోనా కారణంగా 2020,2021 సంవత్సరాల్లో సర్వేలు జరగలేదు.

క్లుప్తంగా

ధాన్యం బస్తాల ధ్వంసం



కిందపడిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో అడవి పందులు ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన గేదెల చిరంజీవులు 12 బస్తాల ధాన్యాన్ని కల్లంలో ఉంచారు. శనివారం రాత్రి అడవి పందులు చొరబడి ధాన్యాన్ని తిని చిందరవందర చేశాయి. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

దంపతుల నిజాయితీ



పెద్దల సమక్షంలో బంగారు హారం అందిస్తున్న పల్ల కరువమ్మ

సారవకోట: మండలంలోని మహాలింగి పంచాయతీకి చెందిన సందపు సుజాత మూడు రోజుల క్రితం తన సోదరుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మూడు తులాల బంగారు హారం పోగొట్టుకుంది. ఆ హారం అదే పంచాయితీ గాతలపేటకు చెందిన పల్ల దాలయ్య, కరువమ్మ దంపతులకు దొరికింది. దీంతో ఆదివారం మహాలింగి వెళ్లి జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు ఉరిటి రంజిత్‌కుమార్, గ్రామస్తుల సమక్షంలో సుజాతకు హారం అందజేశారు. దంపతుల నిజాయితీని మెచ్చి సుజాత రూ.10 వేలను బహుమానంగా అందించింది. గ్రామస్తులు కూడా దంపతులను అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోరులో సిక్కోలు హవా



మహిళల కబడ్డీ జట్టుతో సంఘ ప్రతినిధులు, కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోరులో శ్రీకాకుళం మహిళల జట్టు సత్తాచాటింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా చోడవరం మండలం అంకుపాలెం వేదికగా ఈ నెల 25 నుంచి 27 వరకు 70వ రాష్ట్ర సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్స్‌లో ఓటమిపాలవగా మహిళల జట్టు మాత్రం తుది వరకు పోరాడి రన్నరప్‌గా నిలిచి శభాష్ అనిపించింది. తూర్పు గోదావరి జిల్లాతో జరిగిన ఫైనల్స్‌లో 5–3 సెట్ల తేడాతో ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచింది. మహిళల కబడ్డీ జట్టు రాణింపు పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న, ఆక్కేని చిరంజీవిరావు, సంఘ ప్రతినిధులు, కోచ్ మేనేజర్లు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 173 మందికి 171 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 173 మందికి 173 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 100 మంది 98 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 99 మంది హాజరయ్యారు.

నేడు గాంధీ మందిరం ప్రథమ వార్షికోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం ప్రథమ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకరరావు, ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్‌కర్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు, శ్రీకాకుళం నగర కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మందిర నిర్వాహకులు కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్


బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215


జీవితమైనా.. నగలైనా.. స్వచ్ఛతే ఆభరణం




వారి ఆభరణాలకు అతుకులు ఉండవు. బంగారంలో కల్తీకి అసలు అంగీకరించరు. స్వచ్ఛమైన మేలిమి బంగారంతోనే నగానట్రా చేయించుకుంటారు. దాని కోసం స్వర్ణకారుల వద్ద స్వయంగా కూర్చుని మరీ తమకు కావలసిన రీతిలో వస్తువులు చేయించుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే పల్లె జీవనంలో ఉండే స్వచ్ఛతే తమ అభరణాల్లోనూ ఉండాలని వారు తపిస్తారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని మారుమూల మత్స్యకార, గిరిజన పల్లెల్లో ఇప్పటికీ ఇటువంటి స్వచ్ఛమైన జీవన సౌందర్యం కనిపిస్తుంది. అక్కడి మహిళల మోముల్లో తొణికిసలాడే అమాయకత్వం.. ఈ ఆభరణాల జిలుగులతో వారి అందాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. పల్లెల్లో నిన్నటి తరం ప్రతినిధులైన అమ్మమ్మలు, నాయనమ్మల్లో చాలా మంది ఇలాంటి ఆభరణాలే ధరిస్తుంటారు. అసలు వీటి ప్రత్యేకతలేమిటి..? ప్రస్తుతం వీటిని తయారు చేసే వారు ఎక్కడ ఉన్నారు. తయారు చేయాలంటే ఎంత చార్జీ చేస్తారు..? వంటి వివరాల సమాహారమే ఈ కథనం.



- అతుకులు లేని వస్తువులపైనే మోజు
- వాటి తయారీ కూడా కష్టమే
- భిన్నమైన డిజైన్లతో ఆకట్టుకునే రీతిలో..
- పల్లె అందాలకు వింత సోయగం







శ్రీకాకుళం డెస్క్:

చాలా మ్యాగజైన్లు, పత్రికలు.. ఫొటో ఎగ్జిబిషన్లలో గిరిజన, పల్లెకార మహిళల ఫొటోలను ఇట్టే గుర్తుపట్టేస్తాం. కారణం వారి కట్టు..బొట్టు.. ధరించే నగల్లో ప్రత్యేకత. ముక్కు, చెవి, మెడ భాగాల్లో చిత్రమైన ఆకృతులతో కూడిన వారి నగలు మనల్ని ఆకర్షిస్తాయి. అలాంటి ఆభరణాలు ఏ షోరూమ్‌లలో కూడా కనిపించవు. వాటి కోసం ఎవరూ పెద్దగా ప్రచారం కూడా చేయరు. తయారీదారుల వద్ద ఉండే చిన్న చిన్న ఆల్బమ్(క్యాటలాగ్)లలో మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.

అందానికి ఆరు..

గిరిజన, ఇతర పల్లెల్లో ఉండే ముందుతరం వారు ధరించే ఆభరణాలను పరిశీలిస్తే ఆరు రకాలు కనిపిస్తాయి. వాటిలో చెవి భాగంలో ధరించే నాగులు, కొనకమ్ములు, ముక్కుకు ధరించే కమ్ములు, మెడలో ధరించే పుటకల పేట, మామిడి పిందెల పేట, అడ్డికలను ఎక్కువ మంది ధరిస్తున్నారు. వీటినే నాటి తరం వారు అధికంగా తయారు చేయించుకుంటున్నారు. ఈ ఆభరణాల తయారీకి మేలిమి బంగారం అంటే 24 క్యారెట్ల బంగారంతో మాత్రమే వినియోగిస్తారని చెబుతున్నారు స్వర్ణకారులు.

అతుకు లేకుండా.. అందంగా..

- ఈ ఆభరణాలు అతుకులేకుండా తయారు చేయడంలో ప్రతిభ చూపుతారు స్వర్ణకారులు.
- ఈ ఆభరణాల తయారీకి తరుగు అనేది ఉండదు.
- తయారీకి మాత్రం స్వర్ణకారులు రోజుకూలీని చార్జీ చేస్తారు.
- సుమారు రూ.800 నుంచి వెయ్యి వరకు మజూరీగా తీసుకుంటారు.
- ఆభరణాన్ని గిరిజనులు, గ్రామీణ మహిళలు దగ్గరుండే తయారు చేయించుకుంటారు. కొన్ని గంటల వ్యవధిలో సిద్ధం చేసి ఇస్తారు స్వర్ణకారులు.

అడ్డిగ



చూసేందుకు మనం చేతికి ధరించే బ్రాస్‌లెట్ మాదిరిగా ఉంటుంది. దీన్ని అడ్డిక అని పిలుస్తారు. దీని తయారీకి కనీసం 46 గ్రాముల బంగారం అవసరం. దీన్ని మెడలో ధరించడం నాటితరం వారి సంప్రదాయం.

పురాతన పనిముట్లతో..



నాటితరం మహిళలు ధరించే ఆరు రకాల ఆభరణాలు తయారు చేసేందుకు పురాతన పనిముట్లనే వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి బంగారంతో చేసే ఈ ఆభరణాలకు అతుకులుండవు. ప్రస్తుతం జనం వాడుతున్న ఆభరణాలతో పోలిస్తే వీటిని తయారు చేయడం కొంచెం కష్టమే. కొద్ది మంది మాత్రమే వీటిని తయారు చేస్తున్నారు.

– మహేష్ కడియం, ఆభరణాల తయారీదారు

శరీరంలో భాగంగా..



మేము ధరించే సంప్రదాయ ఆభరణాలు మా శరీరంలో భాగంగా చూసుకుంటాం. విరిగితే తప్ప వాటి జోలికి వెళ్లం.

– సవర రాజముణి, సాబకోట, మందస

గంటల వ్యవధిలో తయారీ..



మేం ధరించే ఆభరణాలు కేవలం కొద్ది గంటల వ్యవధిలో తయారు చేసి మాకు అందజేస్తారు. ఉదయం వెళితే సాయంత్రానికి సిద్ధం చేసి ఇస్తారు. తరుగు ఉండదు. నేను చాలా ఏళ్ల క్రితం ఆభరణాలు తయారు చేయించుకున్నా.

–సవర సరోజిని, సాబకోట, మందస

24 క్యారెట్ల బంగారం అంటే..

- 100 శాతం స్వచ్ఛత కలిగిన బిస్కెట్ బంగారాన్ని 24 క్యారెట్ల బంగారంగా పిలుస్తారు.
- 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంలో 8శాతం రాగి కలిపితే దాన్ని 22 క్యారెట్ల బంగారంగా వ్యవహరిస్తారు. అలాగే 916 అని కూడా పిలుస్తారు.

22 క్యారెట్ల బంగారం దేనికి..

మనం నిత్యం ధరించే గొలుసులు, ఉంగరాలు, హారాలు, ఇతర ఆభరణాలు 22 క్యారెట్ల బంగారంతో తయారు చేస్తారు. 24 క్యారెట్ల బంగారంతో మనం ధరించే వస్తువులు తయారు కావు. ఎందుకంటే మనం ధరించే నగల్ని అతకాల్సి ఉంటుంది. అందులో రంగురాళ్లు, ఇతర అలంకరణ సామగ్రి అమర్చాల్సి ఉంటుంది. అందుకే 22 క్యారెట్ల బంగారం వినియోగిస్తామని తయారీ దారులు చెబుతున్నారు.

క్షయరోగులకు పౌష్టికాహార కిట్లు



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వైద్యశాఖాధికారులు, రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో 1200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో న్యూట్రిషన్ ఫుడ్ కిట్లు పంపిణీ చేస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి చెప్పారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టీబీ పేషంట్లకు పౌష్టికాహార కిట్లు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ట్రైసైకిళ్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1640 టీబీ కేసులు ఉన్నాయని, వీరందరికీ ప్రభుత్వం తరఫున రూ.500 అందజేస్తుండటంతో పాటు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నామని వివరించారు. జాతీయ స్థాయిలో శ్రీకాకుళం జిల్లాలోనే మొదటిసారి ఈ కార్యక్రమం అమలవుతోందని చెప్పారు. కిట్లు అందచేయడానికి పలు స్వచ్ఛంద సంస్థలు, కంపెనీలు ముందుకు రాగా రూ.50 లక్షలు రెడ్‌క్రాస్ ద్వారా అందాయని తెలిపారు. అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి, క్షయ వ్యాధి నిర్మూలనాధికారి డాక్టర్ ఎస్.అనూరాధ మాట్లాడుతూ ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ నయమవుతుందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో ఉన్న కిడ్నీ బాధితుల కోసం గుంటూరు రెడ్‌క్రాస్ ద్వారా రోటరీ ఇంటర్నేషనల్ ప్రతినిధులు తొమ్మిది ట్రైసైకిళ్లు అందించారని తెలిపారు. సి.వి.నాగజ్యోతి వెల్ఫేర్ సొసైటీ, మగటపల్లి రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో వంద మందికి పౌష్టికాహార కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు డాక్టర్ నిక్కు అప్పన్న, పి.శ్రీకాంత్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు కె.సోమసుందరరావు, ఎం.ఎస్.ప్రకాశరావు, పి.ఎస్.ప్రసాదరావు, పి.నరసింహమూర్తి, రెడ్‌క్రాస్ సిబ్బంది పి.చైతన్యకుమార్, బి.చిన్మయరావు, కె.సత్యనారాయణ, బి.సతీష్, బి.శ్రీధర్, పి.సూర్యప్రకాష్, పవన్‌కుమార్, జగదీష్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

నువ్వలరేవును నావలరేవుగా తీర్చిదిద్దుతాం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నువ్వలరేవు గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారని, ఆయన సహకారంతో నువ్వలరేవును నావలరేవుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవు గ్రామస్తులు ఆదివారం మంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. చేపలు వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నామని, నువ్వలరేవు–మంచినీళ్లపేట వద్ద నిర్మిస్తున్న షిప్ ల్యాండింగ్ సెంటర్‌ను ఫిషింగ్ హార్బర్‌గా మార్చి నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామాన్ని పారిశుధ్య సమస్య వెంటాడుతోందని, పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు. అనంతరం మంత్రి స్పందిస్తూ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బైనపల్లి రఘునాథ్, ఎంపీటీసీ మువ్వల ముకుంద, మాజీ సర్పంచ్ బెహరా ధర్మారావు, మాజీ ఎంపీటీసీ భీమారావు, మత్స్యకార సొసైటీ మాజీ అధ్యక్షుడు మువ్వల మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రయ్య, కృష్ణ, దేవా తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సిగడాం

జాతరకు వేళాయె..!



జాతరకు సిద్ధమవుతున్న స్టాల్స్

- కోర్కెలు తీర్చే కల్పవల్లి మహాలక్ష్మి తల్లి
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- నేటి నుంచి ఫిబ్రవరి 1 వరకు యాత్ర



మహాలక్ష్మి తల్లి ప్రతిమలు

రణస్థలం: జనజాతరకు వేళయ్యింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన రణస్థలం మండలం కమ్మసిగడాం పంచాయతీలో వెలసిన మహాలక్ష్మి తల్లి యాత్రకు సర్వం సిద్ధమైంది. లక్షలాది మంది భక్తుల కులదైవంగా విశిష్ట పూజలందుకుంటున్న కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర సోమవారం నుంచి మూడురోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా రథసప్తమి నాడు పెళ్లి రాటతో మొదలై తొలిరోజు సోమవారం అమ్మవారి కల్యాణం జరగడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం సాంస్కృతిక, పౌరాణిక ప్రదర్శనలు, హ్యాండ్‌లూమ్స్, ఇతర కొనుగోలు సామగ్రితో కూడిన దుకాణాల ఏర్పాటు, ఇతర కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

శతాబ్దాల చరిత్ర..

1750లో విజయనగరం సంస్థానాన్ని పూసపాటి పెదవిజయరామ గజపతిరాజు పరిపాలిస్తున్న కాలంలో కమ్మదొరలు రాజకీయాలు, ఇతర కార్యక్రమాల్లో కుడిభుజంగా ఉండేవారు. మహారాజు వద్ద పదివేల మందికిపైగా సైన్యం ఉండేది. వారికి బొట్ల గురప్పదొర, వెలిచేటి చినకూర్మరాయులు అధిపతులుగా ఉండేవారు. చాలామంది జమీందారులు సామంతరాజులుగా ఉండేవారు. శ్రీకాకుళాన్ని పాలించే బాదుర్లాఖాన్, అబ్దుల్లాఖాన్ అనే మహమ్మదీయులు కప్పం చెల్లించడం లేదని, వారిని మన అధీనంలోనికి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో విజయరామరాజు తన సైన్యాధిపతులైన గురప్పదొర, చినకూర్మరాయులును రాయబారులుగా పంపించారు. వారు తిరస్కరించి యుద్ధానికే సన్నద్ధమవ్వమని సందేశం పంపారు. ఈ యుద్ధంలో విజయనగర రాజులు ఓడిపోవడంతో సైన్యాధిపతులు సైతం పలు అవమానాలకు గురయ్యారు. దీనిని భరించలేని గురప్పదొర తన సొంత గ్రామం సంచాం వెళ్లకుండా ఎలాగైనా మహమ్మదీయులపై గెలుపొందాలని ఆలోచించాడు. ఈ క్రమంలో రణస్థలం మండలం దేవరాపల్లి వద్ద సైన్యానికి ఆరు నెలలు శిక్షణ ఇచ్చి తిరిగి మహమ్మదీయులపై యుద్ధం ప్రకటించి గెలుపొందాడు. ఓటమి బాధతో మహమ్మదీయులు మాటువేసి గురప్పదొరను కత్తితో హతమార్చారు. తన భర్త మరణ వార్త విన్న ఇద్దరు భార్యల్లో ఒకరైన మహాలక్ష్మి తన భర్త చితిలోనే సతీసహగమనం చేసుకున్నట్లు పూర్వీకుల కథనం. చితిలో అంతర్ధానమైన మహాలక్ష్మికి చెందిన చీరచెంగు, పసుపు, కుంకుమ భరిణలు ఆహుతి కాకుండా మిగిలి ఉండడాన్ని చూసి అక్కడ పెద్దలు అమెను దైవ స్వరూపినిగా కొలుస్తారు. అగ్నికి ఆహుతైన స్థలంలోనే ఆలయాన్ని నిర్మించి ఏటా జాతర నిర్వహించడం ప్రారంభించారు. చీపురుపల్లి మండలం పెదనడిపిల్లి గ్రామానికి చెందిన కన్నవారు చీర, శతమానం, అత్తవారు గ్రామమైన సంచాం నుంచి మేళంతో బంటుపల్లి కుటుంబీకులు పల్లకి మీద వచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపిస్తారు. ఏటా రథసప్తమి జరిగిన మూడో రోజున మహాలక్ష్మి తల్లి కల్యాణం ఘనంగా జరిగి జాతర చేస్తుండటం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. దీనిని తిలకించేందుకు స్థానికులతో పాటు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు తీర్చుకుంటారు.